తనకి సర్వ్ చేయబడ్డ ఐస్‌క్రీంని పట్టించుకోకుండా ఆ యువకుడు మా అందర్నీ వుద్దేశించి అశాంతిగా అడిగాడు. అయితే మానవ సంబంధాల్లోని క్లేష్‌ని తొలగించలేమనే అంటారా?

పార్టీలో అంతా నిశ్శబ్దంగా వుండిపోయారు. గత మూడు రోజులుగా జరిగిన నేషనల్ కన్వెన్షన్ ఎన్నడూలేనంత వుద్రిక్తంగా గడిచింది.

వాదోపవాదాల్తో, కొత్త సిద్ధాంతాల్తో, ప్రతిపాదనల్తో, ఖండనల్తో అంతా అలిసిపోయి వున్నారు. ముగింపు సమావేశంలో యిష్టంగా తీసుకొనే యీ చిన్న విందులో కూడా మళ్ళీ ఆ ప్రశ్నని ఎదుర్కొనే వోపిక ఎవ్వరికీ లేకపోయింది.

అయినా ఆ యువకుడు ఆగలేదు. ఇన్ని రోజులు యింతగా చర్చించినా నాకు ఏమీ తెలియనే లేదు, నా ప్రశ్నకి జవాబు కావాలి.

నేను కొద్దిగా కళ్ళు పైకెత్తి అతన్ని అబ్జర్వ్ చేశాను. పాతికేళ్ళ వయసు, మొహంలో యింకా పసితనం పీడలేదు, యూనివర్సిటీనే తప్ప జీవితాన్ని ఎరగని జిజ్ఞాస. మొదట్నుంచీ అతను చాలా ఏక్టివ్‌గా వున్నాడు. అతను సబ్మిట్ చేసిన పేపర్స్‌లో మంచి ఎనాల్సిస్ వుంది. ఆ చురుకైన కళ్ళు చూస్తే నాకు హఠాత్తుగా చంటన్నయ్య గుర్తొచ్చాడు. ఆ వెనకే కొన్ని జ్ఞాపకాలు.

నువ్వు అతని ప్రశ్న విన్నావా? దయాబాల మెల్లిగా అడిగింది. ఆమె నాకు తోడుగా వచ్చింది, ఇందులో పాల్గొనడానికి కాకపోయినా మొదట్నుంచీ చర్చలన్నిటినీ ఆమె శ్రద్ధగా ఫాలో అవుతోంది. బహుశా యీ ప్రశ్నకు జవాబివ్వమని కాబోలు ఆమె సూచన. నేనేం జవాబివ్వను? ఇందరు చెప్పలేనిదాన్ని నేను మటుకు చెప్పగలనా? కాని గంభీరంగా మారిపోయిన ఆ చల్లని విందు వాతావరణాన్ని మెత్త పర్చాలన్న వూహతో లేచి నిల్చొన్నాను.

'థాంక్యూ, మీరన్నా ముందుకొచ్చారు' అన్నాడతను, కొద్దిగా యీజ్ లోకి వస్తూ.

నేను నవ్వి "నేను మీ ప్రశ్నకు జవాబివ్వడం లేదు, అది నా శక్తికి మించిన పని. ఇంతవరకూ మనం వాదోపవాదాల్తో విసిగిపోయాం, రేపు విడిపోయున్నాం. ఈ సమయంలోనైనా కాస్త హాయైన విషయాలు మాట్లాడుకొంటే బావుంటుంది, ఏమంటారు?" అన్నాను.

"నా ప్రశ్నకు జవాబు దొరకడం కన్నా నాకు హాయైనది లేదు" అన్నాడతను.

నేను ఒక్క క్షణం వూరుకొన్నాను. ఈ హోటల్ రూఫ్ గార్డెన్స్ మీంచి చూస్తూంటే నగరం ఒక దీపోత్సవంలా కన్పిస్తోంది, మనసులో ఎప్పటివో స్మృతులు గానాన్ని మీటుతున్నాయి. నేను నెమ్మదిగా కుర్చీలో కూచొని "సరే, నేను నా చిన్నప్పటి కొన్ని అనుభవాలు చెప్తాను. అవి మీ ప్రశ్నకు జవాబు కాకపోవచ్చు గానీ, చాలా వరకూ సంబంధించినవే" అన్నాను.

అతను వుత్సాహం కనబరిచాడు. తక్కినవాళ్ళు కొంత ఆశ్చర్యంగా చూశారు. మీటింగుల్లో నిశ్శబ్దంగా వుండిపోయిన మనిషికి యింత ఎక్స్‌ప్రెషన్ వుందా అని కాబోలు. దయాబాల మెత్తని చిరునవ్వుతో—

"అప్పుడు నేను బాగా చిన్నదాన్ని," నేను చెప్పడం మొదలు పెట్టాను. సెకండ్ ఫాం చదువుతుండేదాన్ని. మా నాన్నగారు ఓ పల్లెటూళ్ళో కరణీకం చేస్తూండే వారు. మేం మొత్తం ముగ్గురు మగపిల్లలూ, ముగ్గురు ఆడపిల్లలూ. మా పెద్దక్కయ్యకు పెళ్ళయి పోయింది. పెద్దన్నయ్య ఎం.కాం. చేసి వుద్యోగం లేకపోతే, ఖాళీగా వుండలేక ట్యుటోరియల్ కాలేజి నడిపేవాడు. మా చిన్నన్నయ్య అక్కడే ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీలో చాలా కొద్దిపాటి జీతం మీద మెకానిక్. మా చంటన్నయ్య చాలా ప్రతిభావంతుడు, అతని తెలివితేటలకి పెద్ద యూనివర్సిటీలో చదవాల్సిన వాడు, పరిస్థితులు అనుకూలించక అక్కడే ప్రైవేటు కాలేజిలో డిగ్రీలో జాయినయ్యాడు. తర్వాత మా రెండో అక్క, ఎయిత్ చదువుతూండేది. చిట్టచివర నేను.

అందరం తలోచోట వుండటం కన్నా కలిసి వుండటం మంచిదన్న వుద్దేశంతో పెద్దన్నయ్య మా అన్నయ్యల్నీ, మా యిద్దరు చెల్లాయిల్నీ తన దగ్గరే అట్టే పెట్టుకొన్నాడు. కాని వాడి ఆదాయం అంత నికరంగా వుండేది కాదు. ట్యూషన్స్ బాగా చెప్తాడన్న పేరూ, చాలా మంది ట్యూషన్ కుర్రాళ్ళూ వున్నా ఆదాయం ఎప్పుడూ కన్పించేది కాదు, కాని పగలనక రాత్రనక అన్నయ్య మాత్రం యాతన పడుతుండేవాడు. చిన్నన్నయ్య సర్దే కొద్దిజీతమూ ఏ మూలకీ చాలేది కాదు, తక్కిన ఖర్చంతా నాన్నగారి మీద పడేది.


దీనికి తోడు, మా అన్నయ్య పెళ్ళి కూడా చేసుకొన్నాడు. మా వదిన దూరపు బంధువుల పిల్ల. కొంతవరకూ చదువుకొంది కానీ, అంత లోకజ్ఞానం లేని మనిషి, చిన్నపిల్ల, తనుకొన్నదే నెగ్గి తీరాలని వాదించే మరీ కుర్రతనం, ఇదీకాక, ఆర్థికమైన యిరుకుతనం ఎలా వుంటుందో తెలియని కుటుంబపు భద్రతనుంచి వచ్చిన మనిషి.

పెద్దన్నయ్య పెళ్ళి చేసుకొంటున్నపుడు, అన్నయ్యలిద్దరూ చాలా ఆపోజ్ చేశారు. కాని మా నాన్నగారు ఎంతో యిష్టపడి జరిపించిన పెళ్ళి అది. ఆయన బహు పూర్వకాలం మనిషి. వుద్యోగానికీ, పెళ్ళికీ సంబంధమేమిటో ఆయనకు అర్థం కాదు. వాళ్ళ యవ్వనంలో జీవితంలో యింత యిరుకు లేదు, అభద్రత లేదు, మనుషులకి తిండికీ, గుడ్డకీ లోటు వుండేది కాదు, అంతకు మించి కోర్కెలూ వుండేవి కావు.

మా కుటుంబంలో మా అందరి మధ్యా ఒక గాఢమైన ఆత్మీయత వుండేది. మేం ఒకళ్ళకొకళ్ళం దగ్గరగా వుండాలని అనుకొనే వాళ్ళం. మా పెద్దన్నయ్య సంభాషిస్తే వుంటే ఎంతలేసివాళ్ళు మంత్రముగ్ధులయి పోయేవారు. వాడు కొంతకాలం నాటకాలవాళ్ళతో తిరిగాడు. వాళ్ళని అనుకరిస్తే, వాళ్ళలా పద్యాలు చదువుతో, చెమత్కరిస్తే వుంటూ వుంటే మేం ఎన్నో గంటలు నిముషాల్లా గడిపే వాళ్ళం. పండగలు వచ్చాయంటే చాలు, అంతా మా సొంతవూరు వెళ్ళిపొయ్యే వాళ్ళం. ఆ వూళ్ళోనే మేం పుట్టాం. మా బాల్యం గడిచింది అక్కడే. ఎంతో మనోహరమైన అనుభవాలు ఆ వూళ్ళోనే పొందాం.

మా చిన్నన్నయ్య కామ్ ఫెలో. వాడికి పెద్ద సమస్యలూ, ఆలోచనలూ వుండేవి కావు. పగలంతా ఫ్యాక్టరీలో బండపని చేసి రాత్రి యింటికి రాగానే యింత తిని నిద్రపొయ్యేవాడు.

సమస్యల్లా మా చంటన్నయ్యతో వచ్చేది. వాడు ఎప్పుడూ దేన్నో పోగొట్టుకొని, మరి దేన్నో వెతుక్కొంటున్నట్టుగా అశాంతిగా వుండేవాడు. కాలేజికి కుదురుగా వెళ్ళేవాడు కాదు. ఎప్పుడూ మిత్రబృందాల్తో తిరిగేవాడు, ఎంతసేపూ కథలూ, కవిత్వమూను. పగలనకా, రాత్రనకా తిరుగుళ్ళు. ఏ వేళప్పుడో యింటి కొచ్చేవాడు. దేనిమీదా శ్రద్ధ లేకపోతే, పద్ధతీ, డిసిప్లిన్ లేకపోతే పైకి రావడం



కష్టమని పెద్దన్నయ్య ఎన్నోసార్లు చెప్పి చూశాడు. దేనిమీదా ధ్యాస లేకుండా అర్థంకాని వెర్రితో తిరిగే చంటన్నయ్య మాకు బోధపడేవాడు కాదు. ఇంటిపట్టున వుండి, మాకు తెలియని పాఠాలు చెప్పకూడదా అనేవాడు పెద్దన్నయ్య. కాని వోర్పుండేది కాదు. ఎప్పుడేనా పాఠం చెప్పబోయినా కొద్దిసేపటికే చికాకు పడిపోయి మమ్మల్ని నాలుగు మొట్టికాయలేసి లేచి వెళ్ళిపోయేవాడు. వాడికి బాగా మూడ్స్. ఒక్కోసారి యిష్టంగా కబుర్లు చెప్పి వీధి వాకిట్లో ముగ్గులు పెట్టేసేవాడు. మా రెండో అక్క మాత్రం వాణ్ణి కనిపెట్టుకొని మా అమ్మలా చూసేది, వాడు ఏ రాత్రి వేళో వస్తే నిద్రమేలుకొని వాడికి అన్నం పెట్టేది. అందుకని దాన్ని వాడి పక్షం అనేవారు అంతా.


మూడు చిన్న గదుల యిల్లు. మధ్య గదిలో అన్నయ్యా, వదినా పడుకొంటే, రాత్రి పూట వీధి గదిలో మేం నలుగురం కునికేవాళ్ళం. తెల్లవారు జామునే అన్నయ్య మమ్మల్ని లేపేసి కుర్చీలూ బల్లలూ సర్దేసి ట్యూషన్లు చెప్పడానికి ట్రిమ్‌గా తయారయి పోయేవాడు. కాని వదిన అదో మోస్తరుగా వుండేది. ఎప్పుడూ యింటిమీద బెంగతో వుండేది. మా అన్నయ్యను పెళ్ళి చేసుకొన్నందుకు మా బరువు బాధ్యతలు చూడాల్సిరావడం ఆమెకి కష్టంగా వుండేది. తనే యింకా తల్లిచాటు పిల్లగా పెరిగే వయసులో మమ్మల్ని తల్లిగా దగ్గరకు తీసుకోవడం ఆమెకి అసాధ్యమైన విషయం.

కాని యింతకాలం తర్వాత ఆ యిరుకులో,యిబ్బందిలో గడిచిన రోజుల్ని తలుచుకొంటుంటే నాకు ఏమీ కష్టం కలగక పోగా, అనిర్వచనీయంగా మధురంగా వుంది. ఆ రోజుల్నాటి కష్టమైన సంగతులు కూడా వుల్లాసమైన స్మృతుల్తో వూగిపోతూనే వుంటాయి. అటువంటి ఓ సంఘటన చెప్తాను:

అంతా కుతూహలంగా వింటున్నారు. క్రితం రోజు నా పరిశోధనా పత్రం సమర్పించినప్పుడు కూడా యింత శ్రద్ధగా వినలేదెవ్వరూ. ఉత్సాహంగా తిరిగి అందుకున్నాను:

"అవాళ న్యూ ఇయర్ డే, మాకు మాత్రం అంత హేపీగా తెల్లవారలేదు. అప్పటికి నాలుగు రోజులుగా యింట్లో అందరం ప్రచ్ఛన్న యుద్ధంలో వున్నాం. చంటన్నయ్య మరీ చికాకుగా వున్నాడు, గొడవ తెచ్చింది వాడే. పెద్దన్నయ్య బాధ్యతా రహితంగా వున్నాడనీ, తన స్వార్థం తను చూసుకొంటున్నాడే తప్ప యింట్లో వాళ్ళ సంగతి చూడటం లేదనీ రోజల్లా కష్టపడి యింటికొచ్చే చిన్నన్నయ్యనయినా సరిగా చూడట్లేదనీ గొడవ పెట్టాడు. మా రెండో అక్క వాడిపక్షం అని, దాన్ని సరిగ్గా చూడటంలేదని వదినెతో తగవు పెట్టుకొన్నాడు. తనని ఆజ్ఞాపించే హక్కు తన మొగుడికి తప్ప యింకెవ్వరికీ లేదని వదిన పోరు పెట్టుకు పడింది వాడి మీద. ఇదంతా చూసి చూసి విసుగెత్తి పోయి చిన్నన్నయ్య—నాన్నగారికి కబురంపి ఆయనకి ఫిర్యాదు చేసి తేల్చెయ్యాలను కొన్నాడు."

ఆ రోజు వుదయం నాన్నగారు యింటి నుంచి వచ్చారు. సామాన్లూ, పిండి వంటలూ తీసుకొని ఆనందంగా. కాని ఆ ఆనందం అట్టేసేపు నిలవలేదు. మా వదిన వొంటచెయ్యకుండా అలిగి పడుకోవడం, చిన్నన్నయ్య విసిగి నాన్నగారితో ఫిర్యాదు చెయ్యడం అయ్యాయి. వీధిలో కూచుని పిచ్చిగీతలు గీస్తున్న చంటన్నయ్య వాడికి వత్తాసుగా లోపలకొచ్చి 'నాన్నగారూ' వాళ్ళకి బుద్ధి మీరు చెప్తారా, లేకపోతే మమ్మల్నే చెప్పమంటారా? వాడు పూర్తిగా స్వార్థపరుడు, మమ్మల్ని హింస పెడుతున్నాడు అన్నాడు. ఆ మాటలు వింటూనే వదినె వుక్రోషంతో మామయ్యగారూ, మా ఆయన్ని ఎవరేమన్నా నేను సహించేది లేదు, ఆయన తిండి తింటూ వాసాలు లెక్కెడుతున్నారు. ఇలాంటి విశ్వాస ఘాతకుల్ని యింట్లో వుంచుకోను అంది. చంటన్నయ్య మరీ రెచ్చిపోయి వదినెని నానా మాటలూ అన్నాడు. అంతదాకా తన మీది ఆరోపణలన్నీ చిరునవ్వుతో వింటోన్న పెద్దన్నయ్య కోపం తెచ్చుకొని 'మనం మనం ఎన్ని గొడవలేనా పడతాం, మధ్యలో ఆవిడ్నెందుకు లాగుతారు? ఆవిణ్ణి ఏమన్నా నేను సహించను' అన్నాడు. మా చంటన్నయ్య వూరుకొంటేగా? ఇంకా దుర్భాషలాడేడు. పెద్దన్నయ్య సహనం కోల్పోయి వాణ్ణి ఆ చెంపా యీ చెంపా వాయించేడు. అక్కేమో భయపడిపోయి వాణ్ణి పట్టుకొని ఏడ్చేసింది. చంటన్నయ్య ఎరుపెక్కిన కళ్ళతో 'నాన్నగారూ, వీడు నన్ను కొట్టేడు మీరు చూస్తుండగా, ఎంత దారుణం, యింక యిక్కడ ఒక్క క్షణం కూడా



Join at Once

EFFICIENT POSTAL TUITION

1. M.B.A., M.B.M., D.B.A., A.M.I.B.A., B.G.L., M.A., M.COM., (FOR DEGREE HOLDERS)
2. D.COM., I.COM., B.COM., B.COM(HONS) M.COM., ALL ONE SITTING. (S.S.L.C./H.S.C./P.U.C./INTER PASSED OR FAILED ARE ALLOWED)
3. OSMANIA B.A., B.COM (ONE SITTING) (FOR P.U.C./ INTER H.S.C. CANDIDATES)
4. B.A., B.COM., M.A., (M.U.) (NO PREVIOUS QUALIFICATION REQUIRED)
5. A.M.I.E.(I), A.M.I.MECH.E.(I) EQUIVALENT TO B.E., (RECOGNISED) (FOR S.S.L.C./P.U.C./H.S.C./CANDIDATES)
6. ALLOPATHY
7. A.S.E. CIVIL MECH. ELECT. A.M.AESI., EQUIVALENT TO B.E.. (RECOGNISED) 8. S.S.L.C., 9. H.S.C.,

POPULAR AND EFFICIENT INSTITUTE IN THE WORLD

FOR FULL PARTICULARS SEND Rs. 3/- BY M.O.

SRI MURUGAN TUTORIALS

(ESTD.: 21-3-1952 GOVT. REGD NO. 3072)

H.O.: RISHIVANDIYAM 606 205 (T.N.)

R.O.: 41, ARCOT ROAD KODAMBAKKAM, MADRAS 600 024

B.O.: 416A, MOUNT ROAD, NANDANAM, MADRAS 600 035


వుండను, మీకూ నాకూ సంబంధం లేదు' అనేసి బయటకు పోయి మెట్ల మీద కూచుండిపోయేడు.

అప్పుడు మా నాన్నగారి మొహం నాకు యింకా స్పష్టంగా గుర్తుంది. అప్పుడు ఆ మొహంలో ఏ భావం పలికిందో నేను చెప్పలేను, బహుశా అన్ని భావాలు పలికేయేమో. జీవితం తన సంక్లిష్టమైన స్వరూపంతో ఆయన ఎదట నిలబడేసరికి దాన్ని ఎలా ఎప్రోచ్ కావాలో కూడా తెలియకుండా నిల్చుని పోయారు. కాని జీవితపు యాథార్థ స్వరూపం అవ్యక్తంగా నయినా తెలిసిన ఒక ధీమా ఏదో ఆయన్ని నిలబెట్టింది. ఆయన అరవై యేళ్ళ పాటు కష్టాలకు ఎదురీది నిల్చిన మనిషి. ఎన్నో బరువు బాధ్యతలు నెరవేర్చిన వ్యక్తి. కాని ఆయనకు తను ఎంతో ప్రేమించిన పిల్లలు యిలా దెబ్బలాడుకోవడం ఒకపట్టాన అర్థం కాలేదనే చెప్పాలి. ఆయనకి తన తమ్ముడితో, చెల్లాయిల్తో గొడవపడే అవకాశం రానేలేదు. వాళ్ళని ఆయన శాపించాడు. తమ బాగోగుల్ని ఆయన చేతుల్లో పెట్టినందుకు యథాశక్తి వాళ్ళని ఆయన ఓ దరి చేర్చాడు. కాని మా పెద్దన్నయ్య విషయంలో అలా కాదే. దేశం మారింది, కాలం మారింది. మాకు తెలియని ఏవేవో పెద్ద శక్తులు మమ్మల్ని నడిపిస్తున్నాయి. చంటన్నయ్య తనకన్నా తెలివైనవాడని పెద్దన్నయ్య చాలాసార్లు చెప్పగా విన్నాను, యింక శాసించడం ఎట్లా సాపగుతుంది.

ఆ మధ్యాహ్నం ఎవరికీ భోజనాలు లేవు. మా నాన్నగారు మడతకుర్చీలో అలా చాలాసేపు కూచుండిపోయారు. ఏదో అర్థంకాని చిక్కుగా శూన్యంలోకి ఆయన దృష్టి పెట్టుకొని అచేతనంగా వుండిపోయారు. పెద్దన్నయ్య శాంతంగా మధ్యాహ్నం ట్యూషన్లు పూర్తిచేసి కుర్రాళ్ళను పంపేసి కాసేపు చిందరవందరగా వున్న పుస్తకాల్ని అలమారులో సర్ది ఆ వెనక నెమ్మదిగా నాన్నగారి కాళ్ళ దగ్గర చతికిలపడి—"నాన్న గారూ, తప్పంతా నాదే, నాకు మీరు ఆదర్శం అని ఎన్నోసార్లు అనుకొన్నాను, కాని మీలాగ వుండలేక పోతున్నాను, నామీది విశ్వాసంతో మీరు వాళ్ళని నా దగ్గర వుంచినందుకు నేను వాళ్ళకి న్యాయం చెయ్యలేకపోయాను. నిజమే. వాళ్ళు నాకూ పిల్లలే. కాని యిదిగో, యీ పిల్ల పరాయి యింటిపిల్ల. వాళ్ళని ఓ రోజు సరిగ్గా చూడకపోయినా మీరు అర్థం చేసికోగలరు, కాని యీ పిల్లని జీవితంలోకి తెచ్చుకొని నేను సరిగ్గా చూడకపోతే ఎవరు హర్షిస్తారు చెప్పండి? అందుకే, యిన్ని పొరపాట్లు, నిజమే చంటాడు అన్న మాటల్లో తప్పలేదు. వాడు మేధావి. వాడికి తగిన చదువు చెప్పించ లేకపోతున్నాం, వాడి అశాంతి నాకు అర్థం కాకపోలేదు. వాణ్ణి చిన్నపుడు కుక్క కరిస్తే, నా యీ రెండు చేతుల్తో ఎత్తుకొని డాక్టరు దగ్గరకు తీసి కెళ్ళాను. ఇవాళ వాణ్ణి యీ చేతుల్తోనే కొట్టాను. నాకు నన్ను చూస్తేనే సిగ్గుగా, అసహ్యంగా వుంది, వాడికి సాహిత్యం పరిచయం చేసింది నేను, వాడికి పాత చందమామల కథలు చెప్తేనే గాని రాత్రులు గడిచేవి కావు. ఇపుడు వాడు అసలు నాతో మాట్లాడడు, కవిత్వం ప్రసక్తే ఎత్తడు. అంత కాకుండా పోయాన్నేను, స్వార్థం వున్నంతలో మనిషిని యింతలా వెలేస్తారా? అయినా వాడు కుర్రాడు. పెద్దవాణ్ణి నేనే మూర్ఖంగా ప్రవర్తిస్తే వాడెంత? యిప్పుడు మీ దగ్గర ఒట్టుపెట్టు కుంటున్నాను. వీళ్ళకి ఏ కష్టం కలగనివ్వను..."అని అంటూండగానే కన్నీళ్ళాగలేదు. వాడి పెద్ద నేత్రాలు జలజల మన్నాయి. తన సకలార్హతలూ చూసి కూడా చిన్న ప్రైవేటు కాలేజీ వాళ్ళు పార్టు టైం వుద్యోగానికి కూడా తిరస్కరించినప్పుడు ఒక నిట్టూర్పుతో సరిపుచ్చాడేకాని—అలా దుఃఖపడటం నా కళ్ళ ముందు అదే మొదటిసారి.

పెద్దన్నయ్య మాటలు వింటూనే వదిన కూడా బేలగా నాన్నగారి కాళ్ళమీద పడిపోయి, "నన్ను క్షమించండి మామయ్యగారూ, అసలు తప్పంతా నాదే ఆయనకేమీ తెలీదు. నేనే ఆయన్ను విసిగించాను, మా నాన్నగారి కన్నా మీరే నాకు ఎక్కువ. వీళ్ళంతా నా పిల్లలు..." అని ఏడ్చేసింది. ఆ తర్వాత వీధి మెట్ల మీద దిగాలుగా కూర్చున్న చంటన్నయ్య చేతులు పట్టుకుని బతిమలాడింది. అంతకు ముందే నేనూ అక్కా వెళ్ళి 'యింట్లోకొచ్చే అన్నయ్యా' అంటే నేను రానే, నేను బయటకి పోతాను, ఎక్కడో వుద్యోగం చేసుకొంటాను అన్నాడు. అక్క వెర్రి బాగుల్ది, అన్నయ్యా, వుద్యోగం వుప్పుడుకిప్పుడు యిచ్చేస్తారా అంటే దాన్ని నెట్టేసి యివ్వరే అడుక్కు తింటాను అని అన్నవాడు కాస్త కన్నీళ్ళతో బతిమలాడే వదినని చూసి భయంగా, జాలిగా, బలహీనంగా వొణికిపోయి "ఏం లేదమ్మా, ఏం లేదు" అంటూ కంగారు పడిపోయాడు. నా మీద కోపం లేదా? అంది వదిన "ఏమీ కోపం లేదు, లేదంటున్నాగా" అన్నాడు "అయితే, యింట్లోకి రండి" —

యింకేం చెయ్యాలో తెలీక లోపలికి వస్తున్న చంటన్నయ్యని నాన్నగారు "నారే, యిలాగరా" అని పిల్చారు. బుద్ధిగా దగ్గరకొచ్చి తలొంచుకు నిల్చొన్నాడు. "నువ్వు తెలివైన వాడివే కావచ్చు గానీ, వీడు అన్నయ్య అవునా కాదా" అనడిగారు. 'అయితే' అన్నాడు చంటన్నయ్య. 'అయితే, గియితే కాదు, అవునా కాదా అని చెప్పు' అన్నారు. తలూపాడు అన్నయ్య 'అయితే, వాడికి క్షమాపణ చెప్పుకో'— చంటన్నయ్య అవస్థపడి మాటలు పెగుల్చుకొనే లోగానే పెద్దన్నయ్య వాడి భుజం మీద చెయ్యి వేసి 'మీరూరుకోండి నాన్నగారూ, వాడికీ నాకూ మధ్య యివన్నీ ఏమిటి? ఇక మంచీ వాడు ఎలా చెప్తే అలా నడుచుకుంటాను, ఏరా చంటాడూ, నువ్వు మాటాడకపోతే ఎలా తెలుస్తుంది నాకు అన్నాడు. చంటన్నయ్య తను ఓడిపోతున్నట్టు ఒప్పుకోలేక ధీమా తెచ్చుకోబోయి ఓడిపోయి ఆ వెక్కి తలవాల్చేసి జాలిగా చూసాడు, ఎప్పుడూ అశాంతితో వూగిపోయే వాడి కన్నుల్లో నీళ్ళు!

అసంతృప్తితో కొన్ని రోజులుగా వెచ్చబడ్డ ఆ యిరుకు గదుల్ని కొన్ని హృదయాల్నుంచి వుబికిన కన్నీరు చల్లబరిచింది. నిత్య జీవితపు యిరుకులో మనసుల మీద పేరుకొన్న మాలిన్యాన్ని ఆ అశ్రువులు క్షాళనం చేసేసాయి. పెద్ద వాన కురిసి వెలిసిన తర్వాత అలముకొనే వెలుతురు అప్పుడు మా చుట్టూ అల్లుకొంది.

ఆ రాత్రి అంతా సరదాగా ఫిల్మ్‌కి వెళ్ళాం. ఇంటి కొచ్చాక అన్నాల దగ్గర చంటన్నయ్య గాంభీర్యం నటించబోయి దుఃఖంతో పూడుకున్న గొంతులో ముద్దదిగక కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. అప్పుడు నవ్వారు నాన్నగారు—అది మనోజ్ఞమైన దృశ్యం. ఇప్పుడు వుద్రేకంగా ప్రశ్నిస్తున్న మిమ్మల్ని చూస్తుంటే మా చంటన్నయ్య గుర్తొచ్చి ఆ దృశ్యం స్ఫురణకొచ్చింది. మనం ఎన్ని సిద్ధాంతాలు చేశాం! మనిషి ప్రవర్తనని ఎంత విశ్లేషించాం. కండిషనింగూ, ప్రెజిడిజా, ఆల్‌పోర్ట్ రిప్లెక్సాలజీ— ఇదంతా థీరీ. కాని ఏం అర్థమయింది? జీవితం మన కొలతలకూ, విశ్లేషణలకూ అందనంత విశాలమైంది, దాన్ని అర్థం చేసికోలేం, అనుభవించి తాదాత్మ్యం చెందడమే..."

నేను ముగించి కూచున్నాను.

'సెంటిమెంటల్ ఏన్టిడోట్' అన్నారు ఓ ప్రొఫెసరు గారు.

ఆ యువకుడు కాసేపు ఆగి 'ఒక మిడిల్ క్లాస్ జాయింట్ ఫేమిలీ స్కెచ్ అది, బట్ ఎ ఫార్ క్రై, మనం న్యూక్లియర్ ఫేమిలీస్ యుగంలో ప్రవేశిస్తున్నాం. ఎనీహౌ, యింటరెస్టింగా వుంది అన్నాడు. ఆ యామ్ థాంక్ ఫుల్' అని కూడా అన్నాడు.

'సరిగ్గా యిట్లాంటిదే కన్నడలో ఓ కథ చదివాను, నిరంజనో, సదాశివో ఎవరు రాసారో గుర్తులేదు' అంటున్నారెవరో.

నేను అలసటగా కుర్చీలో వెనక్కి వాలాను, నా భుజం మీద మెత్తని స్పర్శ. నోరగా చూశాను. దయాబాల. ఆమె ఏమీ మాట్లాడలేదు, కానీ ఆమె ముఖంలో సజలార్ద్ర హాసం! సన్నటి నీటిపొరలోంచి ఆమె నేత్రాల కాంతి ఎన్నో యుగాలుగా చెక్కు చెదరకుండా వున్నట్టుగా అన్పించింది.

నిశ్శబ్దంగా లేచి బాల్కనీ బాలుస్ట్రేడ్లని ఆనుకుని నిల్చొన్నాను, బాగా రాత్రయింది. కింది రోడ్ల మీద రద్దీ తగ్గింది. నేను ఏం చెప్పానో, వాళ్ళు ఏం విన్నారో, ఎలా ఫీలయ్యారో—కాని యింత కాలంగా శాస్త్ర సాంకేతికాల్తో అలిసిపోయిన నాకు ఆరోజులూ, ఆ జ్ఞాపకాలూ గుర్తొచ్చి మనసు మెత్తబడింది. ఆ రాత్రి ఫిల్మ్ నుంచి చలికాలపు వెన్నెల్లో అంతా కలిసి యింటి కొస్తుంటే నదినె పాడిన హిందీ పాట లోపల్లోపల మెదిలింది 'ఏక్ ఫిర్ హై హసనా, ఏక్ ఫిర్ హై రోనా, ఏ ఎక్ హై తో దిన్ కా ఖేలా...





## సభా శుభాకాంక్షలు

(జులై 5,6,7 తేదీల్లో లాస్ ఏంజెలస్‌లో జరిగే ఐదవ ఉత్తర అమెరికా తెలుగు మహాసభల్లో పాల్గొంటున్న సందర్భంలో ప్రత్యేకంగా వ్రాసిన అభినందన గీతం.)

దేశయంతటికే వంచే తెలుగులో మాటాడుకో
తెలుగుజాతి సమైక్యగీతి పదేపదే నువుపాడుకో.

నాటి నన్నయ మొదలుగా ఈ నాటి యువకవి అవధిగా
పరిఢవిల్లిన తెలుగు కవితల స్వరం నీలో నింపుకో.

కూచిపూడిగ పేరిణిగ రసకుల్యలను ప్రవహింపజేసిన
తెలుగునాట్య సమర్చనలతో పులకలను పండించుకో.

అపుడు త్యాగయ మాన్య రాగ సుధాంబుధులు పొంగించినట్లే
ముదురు వన్నెల ఇపుడు నీవూ కొత్తబాణీ అల్లుకో.

ఏ ప్రదేశంలోన ఉన్నా ఏ విదేశంలోన ఉన్నా
జీవనిధిగా నీకు మిగిలిన ప్రియ సంస్కృతి నిలుపుకో.
స్వాభిమానం కేతనంగా; సామరస్యం స్పందనంగా
వరలిపోతూ నిత్య నవచైతన్య దీప్తిని పెంచుకో.

ఓ ఉత్తర అమెరికా ఆంధ్రావనీ! "లాసేంజెలస్"లో
సభలు జరిపే తరుణమున నా శుభాకాంక్షల నందుకో.

—డాక్టర్ సి. నారాయణరెడ్డి